నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతల్: ఫీడర్ లైన్ల మరమ్మతుల **కారణంగా** ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో **మంగళవారం** ఉదయం 9:30 నుంచి సాయంత్రం **5.30 గం** టల వరకు విద్యుత్ సరఫరాలో **అంతరాయం** ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ **శ్రీకాంత్** సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. **భూదేవీ** నగర్ సబ్‌స్టేషన్ రామ్‌రాజ్‌నగర్ ఫీడ**ర్ పరిధిలో** ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం **12:30 గం** టల వరకు రామరాజునగర్, ఎండీ**ఎఫ్ రోడ్డు,** శంకర్ ఎన్‌క్లేవ్, సమతానగర్ **అలాగే** మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు న్యూబోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ అలీ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో ప్రియదర్శిని ఎన్‌క్లేవ్, ఆలీ కాంప్లెక్స్, హర్షవర్ధన్ కాలనీ, ఓల్డ్ బోయిన్‌పల్లి లాస్ట్ బస్టాప్, ఓల్డ్ బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్‌ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా ఉండదని వినియోగదారుల గమనించి సహకరించాలని ఏడీఈ కోరారు.

నిజాంపేట్: మియాపూర్ ఎక్స్ రోడ్ సబ్‌స్టేషన్ 11కేవీ శ్రీల గార్డెన్స్ ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీల గార్డెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్, 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హై టెన్షన్ లైన్, నడిగడ్డ తండా, సుభాష్‌నగర్ అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్స్, క్రికెట్ గ్రౌండ్ వెనుక వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. వివిధ బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ షాపూర్ నగర్‌లోని తన నివాసంలో సోమవారం ఆయనను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అదే విధంగా శుభకార్యాలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు ఇచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధి శ్రీరామ్‌నగర్‌లోని బేకరీగడ్డలో రూ.29 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రషీద్, డివిజన్ల అధ్యక్షులు ఎండీ లాయక్, గణేశ్, మహేశ్, విజేందర్, సౌరవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల రుక్మిణి ఎన్‌క్లేవ్ కాలనీకి చెందిన శ్రీనివాస్ (58) ఈనెల 6న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 17న రాత్రి 11.30 గంటల సమయంలో గుండ్లపోచంపల్లి సమీపంలో ఓ వృద్ధుడు (70) అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి వృద్ధుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఈనెల 8న రాత్రి 10 గంటలకు మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చెత్త తరలింపుపై పట్టింపేది..?

- జీహెచ్‌ఎంసీ, పారిశ్రామికవాడ ప్రాంతాల సరిహద్దు రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టని అధికారులు



గాంధీనగర్ పారిశ్రామికవాడ రోడ్డులో..

రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ, పారిశ్రామికవాడ ప్రాంతాల సరిహద్దు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో రగడ కొనసాగుతోంది. పారిశ్రామికవాడ పరిధిలోని చెత్త తరలింపు పాయింట్లు జీహెచ్‌ఎంసీకి ఆనుకుని ఉండడంతో అటు జీహెచ్‌ఎంసీ.. ఇటు ఐలా పట్టించుకోకపోవడంతో రోజుల తరబడి రోడ్లపైనే చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో సీఐఈ గాంధీనగర్, ఐడీఏ గాంధీనగర్, జీడిమెట్ల ఐలా పారిశ్రామికవాడలు విస్తరించి ఉన్నాయి. వీటిని ఆనుకునే కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే రంగారెడ్డినగర్, గాంధీనగర్, సంజయ్‌గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్, నందానగర్ గిరినగర్, గురుమూర్తినగర్ ప్రాంతాలు ఉన్నాయి. అయితే పరిశ్రమల నుంచి ట్యాక్స్‌ల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఐలా అధికారులు చెత్త తొలగింపు విషయంలో మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



జగద్గిరిగుట్ట-ఐడీపీఎల్ రోడ్డులోని పారిశ్రామికవాడ ప్రాంతంలో..

ట్యాక్స్ వసూలు చేస్తాం..చెత్తను తరలించం

గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో ట్యాక్స్‌లు వసూలు చేస్తాం.. చెత్తను మాత్రం జీహెచ్‌ఎంసీ తరలించాలి అన్నట్లుగా ఐలా అధికారుల తీరు ఉంటోందని పలువురు వాపోతున్నారు. దీంతో ఐడీపీఎల్ ఎర్రగోడలను ఆనుకుని రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం, సంజయ్‌గాంధీనగర్ నుంచి గాంధీనగర్, రంగారెడ్డినగర్ నుంచి పంచశీల కాలనీని ఆనుకుని ఉన్న ఐలా ప్రాంతాల్లో రోడ్లపై చెత్తతో కంపుకొడుతున్నాయి.

జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదుల వెల్లువ

ఐలా పరిధిలో పేరుకుపోతున్న చెత్త విషయమై పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న బస్తీల సంక్షేమ సంఘాలు సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో అది తమ పరిధిలోకి రాదని అధికారులు చెబుతున్నా సంక్షేమ సంఘాలు వినడం లేదు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఏలపై ఒత్తిడి తీసుకురావడంతో తమ పరిధిలోకి రాకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో చెత్తను తరలిస్తున్నారు.

కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ కరువు

గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో చెత్త తరలింపు బాధ్యతను ఐలా అధికారులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే వారిపై పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రతిరోజు పారిశుద్ధ్యం నిర్వహించాల్సి ఉండగా వారం రోజులైనా చెత్తను తరలించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులోని గిరినగర్ నాలా సమీపంలో చెత్త గుట్టలుగా కనిపిస్తోంది. దీనికితోడూ ఇటీవల భవన నిర్మాణ వ్యర్థాలు సైతం డంప్ చేస్తున్నారు. అదేవిధంగా నెహ్రూనగర్ సమీపంలో గాంధీనగర్‌ను ఆనుకుని పారిశ్రామికవాడ రోడ్డులో, సంజయ్‌గాంధీనగర్ సమీపంలో చెత్త భారీగా పేరుకుపోతోంది. అయితే గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో చెత్త తరలింపు చేపట్టే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలపై 'సాక్షి' ఐలా అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. అలాగే సదరు కాంట్రాక్టర్లను ప్రశ్నించగా పారిశుద్ధ్య పనులు సక్రమంగానే నిర్వహిస్తున్నాని, ఒక్కోసారి చెత్త తరలింపు వాహనం లేకపోవడంతో తరలించడంలేదని, రోజు విడిచి రోజు చెత్తను తరలిస్తున్నామంటూ పేర్కొనడం గమనార్హం.



సంజయ్‌గాంధీనగర్‌ను ఆనుకుని గాంధీనగర్ పారిశ్రామికవాడలో..

పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తాం

కుత్బుల్లాపూర్: పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పార్కు స్థలాలను సోమవారం పరిశీలించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని 2017 గజాల పార్కు స్థలాన్ని సందర్శించి వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభ, జోనల్ మేనేజర్ రఘువీర్ రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.పి.ఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేశ్ కుమార్, రాజు, కిరణ్, ఆర్గనైజర్ శివకుమార్ పాండే తదితరులు ఉన్నారు.



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

అక్రమంగా రేకుల రూముల కూల్చివేత

చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్



మాట్లాడుతున్న బాధితులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు ప్లాట్లలో నిర్మించిన రేకుల రూములు, ప్రహరీ గోడలను సోమవారం తెల్లవారుజామున అక్రమంగా కూల్చివేశారు. ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల క్రితం తమ ప్లాట్లలో నిర్మించిన గదులతో పాటు ప్రహరీ గోడలను కూల్చివేశారని వాపోయారు. ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. సమావేశంలో బాధితులు రాజ్యలక్ష్మి, కవిత, రజిత, రాంరెడ్డి, శ్రీనివాసాచారి, బాలరాజ్, ధర్మేందర్‌తో పాటు ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చెరుకు శివారెడ్డి, యాదగిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్ ఉండాలి

పోచారం: చౌదరిగూడలోని ఎస్‌బీఐ బ్రాంచిలో సీనియర్ సిటిజన్ల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బ్రాంచ్ మేనేజర్‌కు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరయ్య, ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. స్కాలర్‌షిప్పులు తీసుకునే విద్యార్థులు, పింఛనుదారులు, వ్యాపారస్తులు, సామాన్య ప్రజలతో బ్యాంకు రద్దీగా ఉంటంతో సీనియర్ సిటిజన్లు క్యూలో ఎక్కువ సమయం వేచి ఉంటాల్సి వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్ కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, రాజనర్సు, మల్లయ్య, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌సింగ్, ప్రభాకర్, సర్జిత్ సింగ్, కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వివాహేతర సంబంధం విషయంలో దాడి

జీడిమెట్ల: వివాహేతర సంబంధం విషయంలో ఓ వ్యక్తి ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన ప్రదీప్‌సింగ్ (34) షాపూర్‌నగర్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మాయ సిద్దర్ ఇద్దరు కలిసి స్పా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇదేక్రమంలో ప్రదీప్‌సింగ్ మాయాతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై ప్రదీప్‌సింగ్ అతని భార్య పింకీ మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. కాగా ఆదివారం మాయ పుట్టినరోజు ఉండడంతో మాయ భర్త వెంకటరమణ ప్రదీప్‌సింగ్‌కు ఫోన్ చేసి బర్త్‌డే వేడుకలకు రావాలని కోరగా ప్రదీప్‌సింగ్ అతని స్నేహితులు సింగ్, వినయ్‌ను తీసుకుని సంజయ్‌గాంధీనగర్‌లోని మాయ ఇంటికి వెళ్లారు. అందరూ కలిసి మద్యం తాగిన తర్వాత సోమవారం తెల్లవారుజామున వెంకటరమణ నా భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంటావా అంటూ ప్రదీప్‌సింగ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన వెంకటరమణ సుత్తితో ప్రదీప్‌సింగ్ తలపై కొట్టాడు. అడ్డువచ్చిన సూరజ్‌సింగ్, వినయ్‌పై కూడా దాడి చేయగా తీవ్రగాయాలు కావడంతో ముగ్గురిని షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ప్రదీప్‌సింగ్ భార్య పింకి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసిద్ధ ఆలయాల సందర్శనకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్-1డిపో పరిధిలో తెలంగాణ ప్రసిద్ధ దేవాలయాల సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వి. మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, జైన మందిర్, భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాలు, లక్నవరం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, బొగ్గట్ట వాటర్ ఫాల్స్, మేడారం, రామప్ప ఆలయాలకు రెండు రోజుల పాటు ప్రత్యేకంగా నడుస్తున్నాయని తెలిపారు.ఈ బస్సులు మియాపూర్ నుండి ఉదయం 5 గంటలకు బయల్దేరి పలు దేవాలయాల దర్శనాల అనంతరం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 30 మందికంటే ఎక్కువ భక్తులు ఉంటే ఏ రోజైనా దేవాలయాల సందర్శనకు పంపుతామన్నారు. వివరాలకు 8500309052, 7659029882, 9959226153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికం

నిజాంపేట్: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికమని ఐజేయూ, నేషనల్ కౌన్సిలర్ మెంబర్ రంగు వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. 41 సీఆర్‌పీ కింద నోటీస్ ఇచ్చిన తర్వాతే అరెస్టు చేయాలని కానీ నేరుగా వచ్చి అరెస్టు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వెంటనే కేసు కొట్టేసి, కొమ్మినేనిని విడుదల చేయాలని, లేకుంటే జర్నలిస్టులు పక్షాన ఎదురయ్యే ప్రతిదానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

టీబీపై అవగాహన

అల్విన్‌కాలనీ: 'టీబీ ముక్తి భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మబండలోని ప్రభుత్వాసుపత్రిలో ఏఐ ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ, టీబీపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ..2 వారాలకు మించి ఉండే దగ్గు, దగ్గినప్పుడు, శ్వాస తీసుకున్నప్పుడు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, బలహీనత, సాయంత్రం జ్వరం రావడం, రాత్రిపూట చమటలు రావడం, ఆకలి లేకపోవటం, శ్వాస ఆడకపోవటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దేశాన్ని టీబీ రహితంగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యంగా ఆరోగ్య అధికారులు, సమాజ కార్యకర్తలు, స్థానిక నాయకుల భాగస్వామ్యం ద్వారా టీబీ నిర్మూలన ప్రయత్నాలు ముమ్మరం చేశామన్నారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయచంద్ర, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదు చేస్తున్న గుబ్బల లక్ష్మీనారాయణ

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 10 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో 6 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ విభాగాల సమస్యలపై ఒక్కొక్కటి, శానిటేషన్ విభాగంపై 2 ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్ 1, టౌన్ ప్లానింగ్ 2, మరొకటి శానిటేషన్ విభాగానివి ఉన్నాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. శానిటేషన్ విభాగం పనితీరు అధ్వానంగా ఉందని సుభాష్‌నగర్ డివిజన్ ఎస్‌ఆర్‌నాయక్‌నగర్ కాలనీ వాసులు ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదు చేశారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సంఖ్య పెంచి పారిశుద్ధ్య సమస్య లేకుండా చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ స్ప్రే చేయించాలని గుబ్బల లక్ష్మీనారాయణ కోరారు.

జలమండలి కార్యాలయంలో ..

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో వాటర్ వర్క్స్ జీఎం ఎం.మాధవి ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణిలో 3 ఫిర్యాదులు వచ్చాయి. మార్కండేయనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వేయాలని అఖిల్, మార్కండేయనగర్ వాసులు ఫిర్యాదు చేశారు. చింతల్ ఇంద్రసింగ్‌నగర్‌లో లోప్రెషర్‌తో నీటి సరఫరా అవుతోందని భాస్కర్, కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇంద్రాసింగ్‌నగర్‌లో భూగర్భ జలాలు అడుగంటి రంగు నీళ్లు వస్తున్నాయని, మెరుగుపర్చాలని జీఎంకు విన్నవించారు. చంద్రానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. డీజీఎంలు మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కానికే రెవెన్యూ సదస్సులు

పోచారం: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడలో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. అంకుశాపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సును ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం సదస్సులు కొనసాగుతున్నాయన్నారు. అంకుశాపూర్‌లో 63, ముత్వెల్లిగూడలో 21 అర్జీలను భూయజమానుల నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ రజిని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, ఆర్‌ఐలు కావ్యారెడ్డి, సాయిరామ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంకుశాపూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

శామీర్‌పేట: భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 100 అర్జీలు వచ్చాయని, అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త ఆధ్వర్యంలో అలియాబాద్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 85 అర్జీలు వచ్చాయని తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి కొల్తూర్‌లో తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 63 అర్జీలు రాగా, డిప్యూటీ తహసీల్దార్ అనూష రెడ్డి ఆధ్వర్యంలో అద్రాస్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 73 అర్జీలు వచ్చాయి. మరో మూడు రోజులు పాటు రెవెన్యూ సదస్సులు వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



మేడ్చల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్‌లోని సంఘం కార్యాలయంలో ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో జాతీయ జెండాను, సంఘం జెండాను ఆవిష్కరించి 78 ఏళ్లుగా ఉపాధ్యాయుల కోసం, విద్యా వ్యవస్థ కోసం సంఘం చేసిన సేవలను స్మరించుకున్నారు. సాధించిన విజయాలను వక్తలు తమ ప్రసంగంలో ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్, సంఘం నాయకులు లక్ష్మణమూర్తి, శిరీష, నీరజ, కృష్ణారెడ్డి, విఠల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మన్యం



మన్యంను శాలువా కప్పి అభినందిస్తున్న ఎంపీ రాజేందర్

పోచారం: భారతీయ జనతా పార్టీ ఘట్‌కేసర్ మండల ప్రధాన కార్యదర్శిగా గొబ్బిరి మన్యం నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సోమవారం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడానికి అలుపెరుగని సైనికుడిగా పనిచేయాలన్నారు. అనంతరం మన్యం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానం చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.



తాగునీరు రోడ్డు పాలు..!

వెంకట్రామిరెడ్డినగర్ దారిలో పారుతున్న తాగునీరు

రంగారెడ్డినగర్: జగద్గిరిగుట్ట - ఐడీపీఎల్ రోడ్డులోని గాంధీనగర్ ఆనుకుని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో 300 డయా మంజీరా పైపులైన్ వాల్వ్‌కు సోమవారం ఉదయం లీకేజీ తలెత్తింది. దీంతో మెకిన్స్ పరిశ్రమ రోడ్డు నుంచి వెంకట్రామిరెడ్డినగర్‌కు వెళ్లే రోడ్డులో తాగునీరు ఏరులై పారింది. రహదారి చిత్తడిగా మారడంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జలమండలి అధికారులు లీకేజీని పట్టించుకోకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగునీరు వృథాగా పోయింది. అసలే వర్షాకాలం ప్రారంభం కావడంతో లీకేజీలతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదముందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీనగర్‌లోని మెకిన్స్ కంపెనీ సమీపంలో 300 డయా వాల్వ్‌కు ఏర్పడిన లీకేజీ